# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం　జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 08 | బుధవారం | 5-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:08 | Tuesday | 5-8-2026 | Pages:08 | Cost:2/- |



విలేకరులు కావలెను

తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## ఇన్సూరెన్స్ లేకపోతే పెట్రోల్ ఇవ్వొద్దు..

- కేంద్రానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- 'నో ఇన్సూరెన్స్, నో ఫ్యూయల్' విధానంపై కేంద్రానికి సుప్రీం సూచన
- పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ప్రభుత్వానికి ఆదేశం
- దేశంలో సగానికి పైగా వాహనాలకు బీమా లేకపోవడంపై ఆందోళన
- జాతీయ రహదారులపై ముందుగా అమలు చేయాలని సలహా



దేశంలో బీమా (ఇన్సూరెన్స్) లేకుండా తిరుగుతున్న వాహనాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేని వాహనాలకు పెట్రోల్, డీజిల్ వంటి ఇంధన విక్రయాలను నిరాకరించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు "నో ఇన్సూరెన్స్, నో ఫ్యూయల్" విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ఆదేశించింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. దేశంలో సగానికి పైగా వాహనాలు మోటారు

2లో

## అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు?

- మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు
- బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు
- జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్
- పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్
- తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య

పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన



2లో

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

- గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం
- గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం
- లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం
- ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం
- మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు



ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడ లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది.

మిగతా 2లో



## టాలీవుడ్ విలన్ ప్రదీప్ రావత్ హఠాన్మరణం

- ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ (74) కన్నుమూత
- కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం
- 'గజినీ', 'సై', 'ఛత్రపతి' చిత్రాలతో విలన్‌గా దేశవ్యాప్త గుర్తింపు
- హిందీ, తెలుగు, తమిళ భాషల్లో తన నటనతో చెరగని ముద్ర
- ఆయన మృతి పట్ల సినీ ప్రముఖుల తీవ్ర సంతాపం

2లో

## కృష్ణమ్మ.. కరువు తీరా కదులుతోంది

- ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు పోటెత్తుతున్న వరద
- జూరాలకు 2.41 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- మరో ఐదారు రోజుల్లో నిండనున్న శ్రీశైలం ప్రాజెక్టు





## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

- రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం
- వైసీపీలో చేరిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు
- గూడపాటిని పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్న జగన్

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది.

## అగాధం నుంచి అభివృద్ధి వైపు..

### ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్

- గత రెండేళ్లలో సంక్షేమానికి రూ.1.49 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు
- గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు చర్యలు
- రుణాల రీ-షెడ్యూల్ ద్వారా ప్రభుత్వానికి రూ.8,269 కోట్ల మేర ఆదా
- వైసీపీ పాలనలో రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల జీఎస్డీపీ నష్టపోయిందని వెల్లడి



రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం నుంచి ప్రగతి పథం వైపు నడిపిస్తున్నామని, గత రెండేళ్లలో తీసుకున్న పటిష్ట చర్యలతో రాష్ట్రం అగాధం నుంచి అభివృద్ధి వైపు ప్రయాణిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన నష్టం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపట్టిన దిద్దుబాటు చర్యలను వివరిస్తూ ఆయన మంగళవారం 46 పేజీల 'ప్రోగ్రెస్ రిపోర్ట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గత రెండేళ్ల కాలంలో సంక్షేమానికి రూ.1,49,401 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,33,917 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. మీడియాతో మాట్లాడుతూ, బడ్జెట్ లెక్కలు, ఆర్థిక గణాంకాలు బ్రహ్మ పదార్థం కాదని, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఉండాలనే ఉద్దేశంతో ఈ నివేదికను ప్రజల ముందు ఉంచుతున్నామని అన్నారు. "ఇంట్లో ఆదాయానికి తగ్గట్టు ఖర్చులు ఎలా

2లో



## హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

- 13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశామన్న సజ్జనార్
- ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని వెల్లడి
- కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

భాగ్యనగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఎ-ఖీూూ (ఎఎసవతీఖుఝస ఖీశీశీస ాూఎబశ్రీవతీఖ్ఙశీఅ ాబతీజవఅశ్రీశ్రీఖఅషవ ఎఖుఎ) బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## ఇన్సూరెన్స్ లేకపోతే పెట్రోల్ ఇవ్వొద్దు..

(మొదటి పేజీ తరువాయి)

వాహనాల చట్టానికి విరుద్ధంగా, సరైన బీమా రక్షణ లేకుండానే రోడ్లపై నడుస్తున్నాయని, ఇది అత్యంత ఆందోళనకరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సమస్యను అధిగమించేందుకు 'నో ఇన్సూరెన్స్, నో ఫ్యూయల్' విధానం ఒక ఉత్తమ మార్గమని అభిప్రాయపడింది. ఈ విధానం వల్ల రెండు రకాల ప్రయోజనాలు ఉంటాయని ధర్మాసనం పేర్కొంది. మొదటిది, ఇన్సూరెన్స్ లేని వాహనాలను సులభంగా గుర్తించవచ్చు. రెండోది, వాహన యజమానులకు వారి ఇన్సూరెన్స్ గడువు ముగిసిందనే విషయాన్ని గుర్తు చేసినట్లు అవుతుందని వివరించింది. ఈ నేపథ్యంలో, ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నిర్దేశించింది. ముఖ్యంగా జాతీయ రహదారులు, తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, టోల్ ప్లాజాల వద్ద ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించింది.

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గూడపాటికి వైసీపీ కండువా కప్పి జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... గూడపాటి శ్రీనివాసరావును వైసీపీ కుటుంబంలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడిందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి బలాబలాల దృష్ట్యా రేపల్లె నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుంది.

## హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఎ-ఖీూూ బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశామని వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు?

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# అగాధం నుంచి అభివృద్ధి వైపు..

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామో, రాష్ట్రానికి వచ్చిన ఆదాయాన్ని కూడా అంతే జాగ్రత్తగా అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు పెడుతున్నాం" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర విభజన నాటి కష్టాల నుంచి రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కించామో, 2019 తర్వాత పాలనలో జరిగిన విధ్వంసం, తిరిగి అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంస్కరణలను సోదాహరణంగా వివరించారు.



**గత ప్రభుత్వ తప్పిదాలు.. ఆర్థిక నష్టం**

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు దారుణంగా మందగించిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో సగటున 13.5% జీఎస్డీపీ వృద్ధిరేటు సాధిస్తే, 2019-24 మధ్య అది 10.30 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఈ వృద్ధిరేటును కొనసాగించకపోవడం వల్ల రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల మేర జీఎస్డీపీని నష్టపోయిందని లెక్కలతో సహా వివరించారు. ఇదే సమయంలో తెలంగాణతో తలసరి ఆదాయంలో వ్యత్యాసం భారీగా పెరిగిపోయిందని, 2018-19లో రూ.55,817గా ఉన్న ఈ గ్యాప్, 2023-24 నాటికి రూ.1,06,854కు పెరిగిందని పేర్కొన్నారు. సరైన ప్రణాళికతో ముందుకెళ్లి ఉంటే, 2025-26 నాటికి ఏపీ తలసరి ఆదాయం రూ.3,67,115గా ఉండేదని, కానీ గత ప్రభుత్వ విధానాల వల్ల అది రూ.2,94,507కే పరిమితమైందని, తద్వారా ప్రతి వ్యక్తి రూ.72,608 మేర ఆదాయాన్ని కోల్పోయారని విశ్లేషించారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి ఉన్న రూ.48,616 కోట్ల పెండింగ్ బిల్లులకు గానూ, ఇప్పటికే రూ.19,357 కోట్లు చెల్లించినట్లు సీఎం వెల్లడించారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, సీపీఎస్, పీఎఫ్ వంటి బకాయిల్లో రూ.30,849 కోట్లకు మోక్షం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామని, ఇందుకోసం పెండింగ్‌లో ఉన్న రూ.8,695 కోట్లను కేంద్రానికి జమ చేసి, వినియోగ ధ్రువపత్రాలు (యూసీలు) సమర్పించామని చెప్పారు. దీని ఫలితంగా రాష్ట్రంలో రూ.45,138 కోట్ల అభివృద్ధి పనులు సాధ్యపడగా, ఇందులో కేంద్రం వాటాగా రూ.29,890 కోట్లు అందిందని వివరించారు. స్థానిక సంస్థలకు చెల్లించకుండా నిలిపివేసిన ఆర్థిక సంఘం నిధులను కూడా విడుదల చేశామని, పెండింగ్ బిల్లులతో కలిపి మొత్తంగా రూ.7,404 కోట్లను స్థానిక సంస్థలు, వైద్యారోగ్య రంగానికి బదలాయించామని తెలిపారు.

**రుణాల భారం తగ్గింపు.. భారీ ఆదా**

అధిక వడ్డీలకు తీసుకున్న అప్పుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రుణాల రీ-షెడ్యూల్‌పై దృష్టి సారించిందని చంద్రబాబు తెలిపారు. రూ.1.50 లక్షల కోట్ల విలువైన 370 రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించేలా బ్యాంకర్లతో చర్చలు జరిపి విజయం సాధించామన్నారు. 13% వడ్డీ ఉన్న రుణాలను 10.90 శాతానికి, 9.9% వడ్డీ ఉన్నవాటిని 9.1 శాతానికి, 8% వడ్డీ ఉన్న రుణాలను 7.7 శాతానికి తగ్గించామన్నారు. ఈ చర్యల ద్వారా ఏటా రూ.1,100 కోట్లు ఆదా అవుతోందని, మొత్తం మీద ప్రభుత్వానికి రూ.8,269 కోట్ల మేర ఆదా అయిందని పేర్కొన్నారు.

**సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం**

గత రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ కాలంలో వివిధ పథకాల ద్వారా రూ.1,49,401 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.

## రవికిషన్ మీమ్స్‌కు ప్రపంచవ్యాప్త క్రేజ్.. వాడేస్తున్న యూరప్ ఫుట్‌బాల్ క్లబ్స్!

భోజ్‌పురి సూపర్ స్టార్, గోరఖ్‌పూర్ బీజేపీ ఎంపీ రవికిషన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక సంచలనంగా మారారు. ఆయన పాత సినిమా క్లిప్పులు, ఇంటర్వ్యూలు, పార్లమెంట్ వ్యాఖ్యలు, రియాలిటీ షో సంభాషణలు తరచూ ఇంటర్నెట్‌లో వైరల్ అవుతూ మీమ్ క్రియేటర్లకు పండగ చేస్తున్నాయి. అయితే, ఈ ట్రెండ్ ఇప్పుడు దేశ సరిహద్దులు దాటింది. రవికిషన్‌కు సంబంధించిన మీమ్స్‌ను యూరప్‌లోని ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్లబ్స్ అయిన జువెంటస్, బోరష్యా డార్ట్‌మండ్ కూడా తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆయన "యాక్సిడెంటల్ మీమ్ గాడ్"గా అంతర్జాతీయ గుర్తింపు పొందారు. అమెజాన్ ప్రైమ్ వీడియోలోని 'ది అలయన్స్' అనే రియాలిటీ షోలో రవికిషన్ తన కూతురు రివాతో కలిసి పాల్గొన్నారు. అయితే, తన నియోజకవర్గంలో పనుల కారణంగా షో నుంచి మధ్యలోనే వెళ్లిపోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా, తాను "దేశ సేవ" కోసం "హెడ్‌క్వార్టర్స్" నుంచి పిలుపు వచ్చిందని, వెంటనే వెళ్లాలని చెప్పిన తీరు విపరీతంగా వైరల్ అయింది. ఇదే షోలో "వర్క్ ఫ్రమ్ హోమ్"కు బదులుగా "హోమ్ ఫ్రమ్ వర్క్" అని ఆయన చెప్పడం కూడా మీమర్లను ఆకట్టుకుంది. ఈ రెండు క్లిప్పులు ఇన్‌స్టాగ్రామ్‌ను ఊపేశాయి. ఇదే ట్రెండ్‌ను అందుకున్న జువెంటస్, డార్ట్‌మండ్ క్లబ్స్.. తమ ఆటగాళ్ల వీడియోలను రవికిషన్ డైలాగ్స్‌తో ఎడిట్ చేసి పోస్ట్ చేశాయి. జువెంటస్ క్లబ్ ఒక అడుగు ముందుకేసి, రవికిషన్ పాపులర్ మీమ్స్‌తో ఒక కంపైలేషన్ వీడియోను కూడా పంచుకుంది. తనపై వస్తున్న మీమ్స్ గురించి రవికిషన్ స్పందిస్తూ, "మహాదేవుడి మీద ఒట్టు, నేనెందుకు వైరల్ అవుతానో నాకే తెలియదు" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాను ఎప్పుడూ వైరల్ అవ్వాలని ప్రయత్నించనని, కేవలం సహజంగా ఉంటానని చెప్పారు. ప్రజలు ఇప్పుడు తనను మీమ్స్ ద్వారానే ఎక్కువగా గుర్తుపడుతున్నారని, తనకు నిరంతరం ఈ క్లిప్పులను పంపిస్తూ ఉంటారని తెలిపారు. 'ది అలయన్స్' షో మాత్రమే కాదు, రవికిషన్ పాత క్లిప్పులు కూడా తరచూ ట్రెండ్ అవుతుంటాయి. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో "బూతులు అనేవి ఒక అందమైన రస భావం" అని ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. నీట్-యూజీ పేపర్ లీక్‌పై మాట్లాడుతూ "నీట్ అఖ్బార్ (వార్తాపత్రిక)" అని పొరపాటున అనడం, డబ్బు కంటే గుర్తింపే ముఖ్యమని చెబుతూ "డబ్బు నా వెంటే వస్తుంది బ్రదర్" అనడం వంటివి కూడా మీమ్స్‌గా మారాయి. పాత భోజ్‌పురి సినిమాలోని ఆర్మ్-రెజ్లింగ్ సన్నివేశం, ఆయన డ్యాన్స్ వీడియోలు కూడా మీమర్లకు కావాల్సినంత కంటెంట్ ఇస్తున్నాయి. తన సహజమైన శైలి, నాటకీయ సంభాషణలతో రవికిషన్ అనుకోకుండానే ఇంటర్నెట్ మీమ్ ప్రపంచంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.





## టాలీవుడ్ విలన్ ప్రదీప్ రావత్ హఠాన్మరణం

భారత చలనచిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. 'గజినీ' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రతినాయకుడిగా గుర్తింపు పొందిన ప్రఖ్యాత నటుడు ప్రదీప్ రావత్ (74) కన్నుమూశారు. ముంబైలో ఆయన ఈ సాయంత్రం హఠాన్మరణం చెందారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన, మంగళవారం సాయంత్రం గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచినట్టు తెలుస్తోంది. తెలుగులో 'సై', 'ఛత్రపతి' వంటి చిత్రాల్లో పవర్‌ఫుల్ విలన్‌గా నటించి ప్రేక్షకులను మెప్పించిన ఆయన మరణవార్తతో సినీ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. ఆయనకు భార్య కల్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. నటి రోష్ని అచ్రేజా ఈ విషయాన్ని ధృవీకరించినట్లు ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది. ప్రదీప్ రావత్ మొదట కోకిలాబెన్ ఆసుపత్రిలో, ఆ తర్వాత మరో ఆసుపత్రిలో చికిత్స పొందారని ఆమె తెలిపారు. ఆయన సహనటుడు, 'లగాన్' ఫేమ్ యశ్‌పాల్ శర్మ కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, "మా గజినీ, లగాన్ దేవా ఇక లేరు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి" అని భావోద్వేగ పోస్ట్ చేశారు. బీఆర్ చోప్రా రూపొందించిన 'మహాభారత్' సీరియల్‌లో అశ్వత్థామ పాత్రతో ప్రదీప్ రావత్ తన నటన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 'సర్ఫరోష్', 'లగాన్' వంటి చిత్రాల్లో ముఖ్యపాత్రలు పోషించారు. అయితే, 2008లో వచ్చిన 'గజినీ' చిత్రంలో పోషించిన ప్రతినాయకుడి పాత్ర ఆయన కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచి, దేశవ్యాప్తంగా విపరీతమైన కీర్తిని తెచ్చిపెట్టింది. తెలుగు చిత్ర పరిశ్రమలోనూ ప్రదీప్ రావత్ తనదైన ముద్ర వేశారు. 'సై', 'ఛత్రపతి', 'భద్ర', 'లక్ష్మీ', 'దేశముదురు', 'స్టాలిన్' వంటి అనేక సూపర్ హిట్ చిత్రాల్లో ఆయన విలన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఆయన గంభీరమైన రూపం, డైలాగ్ డెలివరీ విలన్ పాత్రలకు ప్రాణం పోశాయి. హిందీ, తెలుగుతో పాటు తమిళ, నేపాలీ భాషల్లోనూ ఆయన నటించారు. ఇటీవల ఒక నేపాలీ సినిమా షూటింగ్‌ను కూడా ఆయన పూర్తి చేసుకున్నారు. ప్రదీప్ రావత్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు.

# కృష్ణమ్మ.. కరువు తీరా కదులుతోంది

అచ్చంపేట: కృష్ణమ్మ..కరువు తీరా కదులుతోంది. ఆల్మట్టి నుంచి శ్రీశైలం జలాశయం వరకు ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీశైలం జలాశయంలో మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 1,91,076 క్యూసెక్కుల వరద చేరుతుండడంతో జలాశయ గరిష్ట నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకుగాను 106.41 టీఎంసీలకు నిల్వలు చేరాయి. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు 2.41 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 30 గేట్లు ఎత్తి 2.53 లక్షల క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 20 టీఎంసీల నీళ్లు రావడంతో మరో ఐదారు రోజుల్లో జలాశయం నిండనుందని అంచనా వేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసే అవకాశముంది. శ్రీశైలం జలాశయ గరిష్ట నిల్వమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 860 అడుగులకు నీటినిల్వలు చేరాయి. కృష్ణా ప్రధాన పాయపై కర్ణాటకలో ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆల్మట్టి జలాశయానికి 1.5 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో నారాయణపూర్ జలాశయానికి 1.5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 1.45 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో ఉపనది భీమాపై ఉన్న ఉజ్జయినీ జలాశయానికి 68,897 క్యూసెక్కుల వరద వస్తుండగా, 75,626 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఇక ఉపనది తుంగభద్రపై కర్ణాటకలో ఉన్న తుంగభద్ర జలాశయానికి సైతం వరద ఉధృతి పెరుగుతోంది. జలాశయానికి 82,087 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 105.79 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గానూ 51.15 టీఎంసీలకు నిల్వలు చేరాయి. వరద ఇలానే కొనసాగితే మరో వారం రోజుల్లో తుంగభద్ర జలాశయం సైతం నిండి శ్రీశైలం వైపు తుంగభద్ర జలాలు పరుగులు తీయనున్నాయి. సాధారణంగా ఆగస్టులోనే కృష్ణానదికి అధిక వరద వస్తుందని నీటిపారుదల శాఖ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో కృష్ణమ్మ ఆశలు రేకెత్తిస్తోంది.



# ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలి

**- వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని రమేష్‌గౌడ్, వైస్ ఛైర్మన్ వినయ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఈ నెల 7న బెంగళూరులో జరగనున్న 11వ అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని చౌటుప్పల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్, వైస్ ఛైర్మన్ గోశిక వినయ్ పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ పార్కులో బీసీ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభల వాల్‌పోస్టర్లను వారు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా, ఉపాధి రంగాల్లో బీసీలకు తగిన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీసీల ఐక్యత ద్వారానే హక్కుల సాధన సాధ్యమవుతుందన్నారు. మునుగోడు నియోజకవర్గ బీసీ యువజన, విద్యార్థి సంఘాల అధ్యక్షులు వీరమళ్ల కార్తీక్‌గౌడ్, బండిగారి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ఆలే శ్రీలత చిరంజీవి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సిలువేరు శ్రీనివాస్, బీసీ యువజన సంఘం నాయకుడు ఉష్కాగుల నాగరాజు, క్లాత్ షోరూం అధ్యక్షుడు కర్నాటి శ్యాంసుందర్, ప్రవీణ్, నవీన్, ప్రదీప్, ఆకాష్, అరవింద్, సుధీర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల వైవిధ్యీకరణతోనే స్థిర ఆదాయం: ఏడీఏ నిర్మల

**- పల్లెర్లలో వ్యవసాయ క్షేత్రాల పరిశీలన**



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** వర్షాభాబ హై 68వ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణను అవలంబించాలని ఆలేరు వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) నిర్మల సూచించారు. మంగళవారం ఆమె ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో పలు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. దగ్గరగా విత్తుకునే విధానంలో సాగు చేసిన పత్తి, కంది-వేరుశెనగ అంతర పంటలు, పెసర తదితర పంటలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పంటల మార్పిడి, వైవిధ్యీకరణ ద్వారా సాగు ఖర్చు తగ్గి స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. పత్తిని దగ్గరగా విత్తుకోవడం వల్ల ఎకరాకు మొక్కల సంఖ్య పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని, నీరు, ఎరువుల వినియోగ సామర్థ్యం మెరుగుపడుతుందని వివరించారు. కంది-వేరుశెనగ లాంటి అంతర పంటలతో అదనపు ఆదాయం రావడమే కాకుండా భూసారం పెరుగుతుందన్నారు. పప్పుధాన్యాల సాగుతో నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి తదుపరి పంటలకు మేలు జరుగుతుందని తెలిపారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చీడపీడలను తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్, విస్తరణ అధికారి ఎం.అశోక్ కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ

**- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బాలింతలకు అవగాహన**

**- పుట్టిన తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి: అంగన్‌వాడీ టీచర్లు**

**తొలివెలుగు, చిన్నగూడూరు:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని గుండంరాజుపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే ఉత్తమ ఆహారమని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిశువు జన్మించిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలలో శిశువుకు అవసరమైన విలువైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే మూలకాలు సమృద్ధిగా ఉంటాయని వివరించారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఇతర ఆహారం లేదా నీరు ఇవ్వకూడదని సూచించారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని, వివిధ రకాల అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం ద్వారా తల్లిపాల ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మూలజ్యోతి, సంధ్యారాణి, సుమలత, కవిత, శ్రీమతి, ఆయా అనిత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి అండగా రేగు సిద్ధులు

**- దివ్యాంగుడు దండే నవీన్ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత**

**- కష్టకాలంలో మానవత్వం చాటిన సామాజిక కార్యకర్త.. ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని పిలుపు**




**తొలివెలుగు, రాజాపేట:** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని నిరూపిస్తూ రాజాపేట మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త రేగు సిద్ధులు మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దివ్యాంగుడు దండే నవీన్ కుటుంబాన్ని మంగళవారం ఆయన స్వయంగా పరామర్శించి, వారి కష్టసుఖాలను తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా రేగు సిద్ధులు మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ ఇంటి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత సహాయం అందించాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో ఇచ్చే చిన్న సహాయం కూడా బాధిత కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని, భరోసాను ఇస్తుందని అన్నారు. దివ్యాంగుడు దండే నవీన్ మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్న ఆయన, కుటుంబ సభ్యులు మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించారు. అవసరమైన సమయంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రేగు సిద్ధులు అందించిన సహాయంపై నవీన్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో తమను పరామర్శించి, ఆర్థికంగా కాకపోయినా నిత్యావసర వస్తువులతో ఆదుకోవడం ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న రేగు సిద్ధులు వంటి వ్యక్తులు మరెందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కష్టకాలంలో ముందుకు వచ్చి సహాయం చేయడం గొప్ప విషయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో దోమల పాండు, కాకల కనకయ్య, బాలరాజు, నవీన్ కుటుంబ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి





**- అంగన్‌వాడీ కేంద్రం తనిఖీలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**- ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచన**

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-3 ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, లబ్ధిదారుల హాజరు నమోదు తీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, విద్యాబోధన గురించి ఆరా తీశారు. పిల్లలకు రంగులు, బొమ్మలు చూపించి వారి అభ్యాస సామర్థ్యాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం కేంద్రానికి వచ్చిన గర్భిణులతో మాట్లాడుతూ.. రక్తహీనత లేకుండా చూసుకోవాలని, క్రమం తప్పకుండా స్కానింగ్ తదితర వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, మెరుగైన



సౌకర్యాలు ఉన్నాయని, అక్కడే ప్రసవాలు చేయించుకుని ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బీఎల్‌ఓలుగా విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్‌ఐఆర్) ఫారాలను అర్హుల నుంచి సేకరించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు





**- రాజాపేట మండలంలోని నమిల, బసంతపురంలో ఘనంగా నిర్వహణ**

**- 384 పశువులకు చికిత్సలు.. 124 మంది రైతులకు లబ్ధి**

**తొలివెలుగు, రాజాపేట:** పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పాడి రైతులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాజాపేట పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నమిల, బసంతపురం గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. నమిల గ్రామ సర్పంచ్ పులి రాజు, బసంతపురం గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి శిబిరాలను ప్రారంభించారు. శిబిరాల్లో పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, దూడలకు నట్టల నివారణ మందులు, సాధారణ వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పశువుల సంరక్షణ, వ్యాధుల నివారణ, పోషకాహార నిర్వహణపై రైతులకు వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 384 పశువులకు చికిత్సలు అందించగా, 124 మంది రైతులు లబ్ధి పొందారు. పశువుల ఆరోగ్యంపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యులు సూచించారు. బసంతపురం గ్రామంలో నిర్వహించిన మెగా పశువైద్య శిబిరం సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. గ్రామ పాడి రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పశువులకు వైద్య సేవలు అందించుకున్నారు. గ్రామంలో ఇలాంటి ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ సర్పంచ్‌ను రైతులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ కె. భాస్కర్, డాక్టర్ పున్నయ్య, డాక్టర్ ప్రగతి, డాక్టర్ ముక్కంటి రాజు, పశుగణాంక అధికారి పెండెం శ్రీనివాస్, సిద్ధులు, రవి, అశోక్, అలంబిక్ వెంకటేష్, ఇంటస్ నవీన్, మ్యాన్‌కైండ్ ఉదయ్, ఆమైనో ఉమేష్, మైక్రో శ్రీను, రేణుక, గోపాలమిత్రలు మహేష్ తదితరులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.



# ట్రాక్టర్ డీజిల్ బిల్లు చెల్లించడం లేదని ఫిర్యాదు

**- ఎంపీవోకు విన్నవించిన పెట్రోల్ బంక్ యజమాని**

**తొలివెలుగు, రాజాపేట:** బొందుగుల గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు సంబంధించిన డీజిల్ బకాయిలు చెల్లించడం లేదని ఓ పెట్రోల్ బంక్ యజమాని మంగళవారం ఎంపీవో ఆవుల కిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత కొన్ని నెలలుగా పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ పోస్తున్నామని, సుమారు రూ.60 వేల వరకు బిల్లు పెండింగ్‌లో ఉందని, అడిగినా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎంపీవో కిషన్ తక్షణమే స్పందించి ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరారు. గత కార్యదర్శి హయాంలోనే ఈ బకాయిలు పేరుకుపోయాయని, రాబోయే 15 రోజుల్లో పూర్తి బిల్లును చెల్లిస్తామని కార్యదర్శి శ్రీనివాస్ ఎంపీవోకు వివరించారు.

# అంగన్వాడీ కేంద్రానికి బీరువా బహూకరణ

**- దూదివెంకటాపురం ఫస్ట్ సెంటర్‌కు ఉప సర్పంచ్ వెంకటేశం, దాతల సహకారం**

**- పిల్లలకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా విరాళం**



**తొలివెలుగు, రాజాపేట:** చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో రాజాపేట మండలంలోని దూదివెంకటాపురం ఫస్ట్ సెంటర్ అంగన్వాడీ కేంద్రానికి గ్రామ ఉప సర్పంచ్ ఇరగదిండ్ల వెంకటేశం మంగళవారం బీరువాను బహూకరించారు. అదేవిధంగా గొట్టిపాముల అశోక్ చిన్న బీరువాను అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల విద్యా సామగ్రి, పోషకాహార వస్తువులు, ఇతర అవసరమైన సామగ్రిని భద్రపరచేందుకు ఈ బీరువాలు ఎంతో ఉపయోగపడనున్నాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నడిమిటి నరేష్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వంతో పాటు సమాజం కూడా భాగస్వామ్యం అయినప్పుడే చిన్నారులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అంగన్వాడీ టీచర్ భీమగాని సుజాత మాట్లాడుతూ.. కేంద్రానికి బీరువాలను అందజేసిన ఉప సర్పంచ్ ఇరగదిండ్ల వెంకటేశం, దాత గొట్టిపాముల అశోక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారం కేంద్ర నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడిమిటి నరేష్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే నా ధ్యేయం

- **రూ.కోటి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**
- **సర్పంచ్ మోటే మోటే బాలకృష్ణ**



**తొలువెలుగు,భూదాన్ పోచంపల్లి:** గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని సర్పంచ్ మోటే బాలకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్ద రావులపల్లి శివారు మామిళ్లగూడెంలో హెచ్‌డీఎఫ్ నిధులు రూ.100 లక్షల (కోటి రూపాయల)తో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని శివారు కాలనీల్లో మిగిలిపోయిన మౌలిక వసతులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి లక్ష్యంగా గ్రామాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్కాల భానుచందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరసింహ, వార్డు సభ్యుడు పరసమోని సత్తయ్య, మాజీ వార్డు సభ్యుడు గోపాల్ రెడ్డి, గ్రామస్థులు వెంకటేష్, దయాకర్, సత్తిరెడ్డి, విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డలకు దివ్య ఔషధం తల్లిపాలు.

**- మండల వైద్యాధికారి శ్రీవాణి.**

**తొలి వెలుగు, భూదాన్ పోచంపల్లి:** బిడ్డకు తల్లిపాలు దివ్య ఔషధంలా పనిచేస్తాయని మండల వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. పురపాలక కేంద్రంలో మంగళవారం అంగన్వాడి 11 సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై బాలింతలకు గర్భిణీ స్త్రీలకు తల్లిపాల 30 అవగాహన నిర్వహించారు. అప్పుడే పుట్టిన పిల్లలకు గంట లోపల ముర్రిపాలు పట్టడం ద్వారా పిల్లల రోగ నిరోధక శక్తి పెంచే ఔషధ గుణాలు ఉంటాయని తద్వారా పిల్లలు ఆరోగ్యం గా ఉంటారని తెలిపారు. మంచి పోషకాహారం గుడ్లు చేపలు పప్పు దినుసులు ఆకుకూరల ప్రతినిత్యం తీసుకోవడం ద్వారా పాలు పాలు వృద్ధి చెందుతాయని ఆమె అన్నారు. అనంతరం బాలింతలు గర్భిణీ స్త్రీలతో తల్లిపాల అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మాధవి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్, జానకి, ఆశ కార్యకర్త సువర్ణ తదితరులు ఉన్నారు




# హైదరాబాద్‌లో 18 శాతానికి తగ్గిన వర్షపాతం లోటు..



గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరానికి గణనీయమైన ఊరట లభించింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న వర్షపాత లోటు ప్రస్తుతం 18 శాతానికి తగ్గింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షపాతం ఒకే రీతిలో లేదు. తిరుమలగిరిలో 45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్‌లలో 26 శాతం చొప్పున అత్యధిక లోటు నమోదైంది. మరోవైపు, గోల్కొండలో సాధారణం కంటే 19 శాతం, బహదూర్‌పురాలో 5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. షేక్‌పేట, అమీర్‌పేట, ముషీరాబాద్, ఆసిఫ్‌నగర్ వంటి ప్రాంతాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరువలో ఉంది. రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆగస్టు 10 వరకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఈ వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని, ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేసింది.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**- విద్యార్థులకు చౌటుప్పల్ పోలీసుల అవగాహన కార్యక్రమం**

**- ఓటీపీ, యూపీఐ, ఫేక్ కాల్స్, సోషల్ మీడియా మోసాలపై కీలక సూచనలు**

**తొలివెలుగు, చౌటుప్పల్:** సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ సూచించారు. మంగళవారం టీజీఆర్ఎస్ అండ్ జూనియర్ కళాశాల, బంగారిగడ్డ, చౌటుప్పల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ ఫోన్ కాల్స్, ఓటీపీ మోసాలు, యూపీఐ మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా మోసాలు, నకిలీ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.

**వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వొద్దు:**

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మరాదని సూచించారు.




ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు.

**సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలి:**

విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు



భయపడకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

**ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి:**

సైబర్ భద్రతపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్న ఇన్‌స్పెక్టర్, విద్యార్థులు తమతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# మానవత్వానికి సరిహద్దులు లేవు

**- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు**

**- సామాజిక కార్యకర్త సైదులు, ఉపాధ్యాయుడు నీలం శేఖర్ వెల్లడి**

తొలివెలుగు, రామన్నపేట: ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ విద్య, వైద్యం, జీవనోపాధి రంగాల్లో మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సామాజిక కార్యకర్త వేముల సైదులు, ఎన్నారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నీలం శేఖర్ తెలిపారు. రామన్నపేటలో వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తొండ తిరుమలగిరి మండలం కొత్తగట్టుకు చెందిన స్వాతి అకాల మరణంతో అనాథలైన ఇద్దరు కుమార్తెల భవిష్యత్తు కోసం వివిధ దాతల సహకారంతో రూ.1.88 లక్షలు ఫిక్స్డ్ డిపాజిట్ చేసినట్లు చెప్పారు. కోదాడ సమీపంలోని మంగళకుంట తండాకు చెందిన వికలాంగ నిరుద్యోగి రవి నాయక్‌కు రూ.90 వేల విలువైన ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. 'ఆపద్బాంధవులు ఫౌండేషన్' ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు నెలకు 25 నుంచి 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించడంతో పాటు స్వయం ఉపాధికి కుట్టు మిషన్లు, కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసి ఇస్తున్నట్లు వివరించారు. బాధితులు స్వయం సమృద్ధి సాధించడమే తమ లక్ష్యమని పేర్కొంటూ సహకరిస్తున్న దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.






# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం

**చౌటుప్పల్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ర్యాలీ**

**- హాజరైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని, వైస్ ఛైర్మన్ వినయ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించడం బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల (ఆగస్టు 1-7) సందర్భంగా చౌటుప్పల్‌లో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్, వైస్ ఛైర్మన్ గోషిక వినయ్ ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వైద్యాధికారి డా. కాటంరాజు మాట్లాడుతూ.. తొలి ఆరు నెలల తర్వాత పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలను అందిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్, సూపర్‌వైజర్లు సాయిరెడ్డి, ఇస్తారీ, ఝాన్సీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పాము కాటుకు గురై కార్మికుడి బలి

- చికిత్స ఫలించక మునిపంపుల వాసి మృతి
- కేసు నమోదు చేసిన రామన్నపేట పోలీసులు


ఉండ్రాతి వెంకన్న (ఫైల్ ఫోటో)

**తొలివెలుగు, రామన్నపేట:** పాము కాటుకు గురై భవన నిర్మాణ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన రామన్నపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గోపాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... మునిపంపుల గ్రామానికి చెందిన ఉండ్రాతి వెంకన్న (33) గత నెల 31న కొత్తగూడెం గ్రామంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విషసర్పం కాటువేసింది. గమనించిన సహచరులు వెంటనే ఆయనను రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి పరిస్థితి విషమించడంతో పెరుమాండ్ల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం వెంకన్న కన్నుమూశాడు. మృతుడి భార్య నవనీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ మెడలో పుస్తెల గొలుసు అపహరణ

- 2.5 తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన దుండగులు
- నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన



**తొలివెలుగు, నాగోలు:** చర్చిలో ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు దుండగులు లాక్కెళ్లిన ఘటన నాగోలు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఆర్ కాలనీకి చెందిన సాగ్గం ధనమ్మ (56) ఆర్.కె.నగర్‌లోని చర్చిలో ప్రార్థనలు ముగించుకుని సాయంత్రం ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. తట్టిఅన్నారం హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీప వీధిలోకి రాగానే పల్సర్ బైక్‌పై వచ్చిన ముగ్గురు అపరిచిత వ్యక్తులు ఆమె మెడలోని సుమారు రెండున్నర తులాల బంగారు పుస్తెల గొలుసును తెంపుకొని తట్టిఅన్నారం వైపు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో నాగోలు పోలీసులు కేసు నమోదు చేశారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## జూనియర్ విద్యార్థిపై ర్యాగింగ్.. పిడిగుద్దులతో దాడి

- ముక్కు ఎముక విరగడంతో ఆసుపత్రిపాలైన ఇంటర్ విద్యార్థి
- ఫిజిక్స్ వాలా కళాశాల యాజమాన్యం, సీనియర్లపై కేసు నమోదు

**తొలివెలుగు, కొత్తపేట/చైతన్యపురి:** కొత్తపేటలోని ఫిజిక్స్ వాలా జూనియర్ కళాశాలలో ర్యాగింగ్ ఘాతుకం వెలుగుచూసింది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న జూనియర్ విద్యార్థిపై సీనియర్లు పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డ ఘటనపై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌కు చెందిన ఓ 17 ఏళ్ల విద్యార్థి సదరు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం కళాశాల ఫెస్ట్‌కు సంబంధించిన చర్చల సమయంలో కొందరు సీనియర్లు జూనియర్లను వేధింపులకు గురిచేశారు. బాధితుడిని దుర్భాషలాడుతూ బెదిరించిన సీనియర్లు, సాయంత్రం కళాశాల వెలుపల అడ్డగించి దాడికి దిగారు. ఈ ఘటనలో విద్యార్థి ముక్కు ఎముక విరగడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆయన్ను ఓజోన్ ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్స అవసరమని వైద్యులు వెల్లడించారు. కళాశాల యాజమాన్య నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీనియర్ విద్యార్థులతో పాటు ఫిజిక్స్ వాలా కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ర్యాగింగ్, వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చైతన్యపురి పోలీసులు స్పష్టం చేశారు.

## కంటి వెలుగుకు ఆసరా.. రేపే ఉచిత రివ్యూ శిబిరం

- కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- కొత్తవారికీ కంటి పరీక్షలు
- లక్కారంలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం, మున్సిపాలిటీ ప్రజల కోసం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న (గురువారం) ఉచిత కంటి వైద్య రివ్యూ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత జూలై 4న నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో శస్త్రచికిత్సలకు ఎంపికై, ఆపరేషన్లు పూర్తి చేసుకున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని పునఃపరిశీలించేందుకు (రివ్యూ) ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. లక్కారంలోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుంది. శస్త్రచికిత్సలు చేయించుకున్న వారితో పాటు కంటి సమస్యలతో బాధపడుతున్న కొత్త వారికి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. చౌటుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు, కంటి సమస్యలున్న బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# సర్కారు వైద్యానికి మహర్దశ



- వారం రోజుల్లో సమర్పించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం
- సచివాలయంలో మంత్రిని కలిసి సమస్యలు వివరించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- చౌటుప్పల్‌లో ట్రామా కేర్, మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్లు
- సెప్టెంబరులో చౌటుప్పల్ ఏరియా ఆసుపత్రి ప్రారంభం



**తొలివెలుగు, హైదరాబాద్:** మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక అందజేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో ఆయనతో భేటీ అయ్యారు. నియోజకవర్గంలో వైద్య సేవల విస్తరణపై ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మునుగోడు, నాంపల్లి పీహెచ్‌సీలను 30 పడకల ఆసుపత్రులుగా, మర్రిగూడ సీహెచ్‌సీని 30 నుంచి 50 పడకలకు విస్తరించాలని కోరారు. చండూరులో 100 పడకల ఏరియా ఆసుపత్రి మంజూరుతో పాటు గట్టుప్పల్ పీహెచ్‌సీలో సిబ్బంది, పరికరాలు సమకూర్చాలన్నారు. జాతీయ రహదారి 65పై జరిగే ప్రమాద బాధితుల రక్షణార్థం చౌటుప్పల్‌లో ట్రామా కేర్ సెంటర్, మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతులపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. చౌటుప్పల్ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేసి, సెప్టెంబరులో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, హెల్త్ కమిషనర్ డాక్టర్ సంగీతా సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, నల్గొండ, యాదాద్రి జిల్లాల డీఎంహెచ్‌వోలు రాహుల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం బోనాలు





- దేవాలయ కమిటీలకు బోనాల నిధుల చెక్కుల పంపిణీ
- ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి: మధుయాష్కి గౌడ్

**తొలివెలుగు, ఎల్బీనగర్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయ కమిటీలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు దేవాలయ కమిటీలకు మంజూరైన బోనాల నిధుల చెక్కులను మంగళవారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలతో కలిసి మధుయాష్కి గౌడ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

**బోనాల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహకారం:**

ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోన్నత సాంస్కృతిక ఉత్సవమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధితో పాటు బోనాల ఉత్సవాల నిర్వహణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ నిధులు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం అందించిన నిధులను సద్వినియోగం చేసుకుని దేవాలయ కమిటీలు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. బోనాల పండుగ రాష్ట్ర ప్రజల విశ్వాసాలకు, సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో ఈ ఏడాది ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహించేందుకు ప్రతి దేవాలయ కమిటీ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్ గౌడ్, దేవాదాయ శాఖ ఈవో శోభన్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, దేవాలయ కమిటీల ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి దారుణ హత్య



సైదాబాద్, ఆగస్టు 4 : స్నేహితుల మధ్య తలెత్తిన వివాదం దారుణ హత్యకు దారి తీసింది. ఈ ఘటన సైదాబాద్ సింగరేణికాలనీలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సైదాబాద్ సింగరేణికాలనీ వాంబే కార్వర్టర్స్‌లో నివసించే ఆమేర్ (40)ఆటో డ్రైవర్. అదే ప్రాంతంలో నివసించే నల్గొండ జిల్లా దేవరకొండ సంధ్యా తండాకు చెందిన ఇంద్రావత్ సుమన్ కూడా ఆటో డ్రైవరే. ఇద్దరు పాతనేరస్తులు. స్నేహితులు కావటంతో ఇద్దరు కలిసి కొంత కా లంగా అక్రమంగా గంజాయి వ్యాపా రం చేస్తున్నారు. గంజాయి ముఠాలతో సంబంధాలు ఉండటంతో తరుచు సుమన్ ఇంట్లో కలుసుకునే వారు. కాగా సుమన్ కుటుంబ సభ్యులతో హమేర్ కొన్ని రోజుల క్రితం అసభ్యంగా ప్రవర్తించడాన్ని గమనించాడు. దీంతో ఎలాగైనా హమేర్‌ను హతమార్చాలని సుమన్ పథకం వేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఇద్దరు కలిసి మద్యం, గంజాయి తాగారు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో సుమన్ తన వద్ద ఉన్న కొబ్బరి బోండాలను కొట్టే కత్తితో అందరు చూస్తుండగా విచక్షణరహితంగా హమేర్‌ను దారుణంగా హత్య చేశాడు. నిందితుడు అక్కడి నుంచి నేరుగా సైదాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. వెంటనే క్లూస్ టీం పోలీసులు, సైదాబాద్ ఏసీపీ వెంకట్ రెడ్డి, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కుని మహిళ మృతి



కొండాపూర్ందానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. మృతురాలి భర్త, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగండ్లలో నివాసం ఉండే ధాడి శ్రీనివాస్ తన భార్య అనసూయ(43)తో కలిసి మంగళవారం చందానగర్ చాట్వాజ్ మెన్షన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మేనమామ ధాడి గోవింద్‌ను పరామర్శించేందుకు వచ్చారు. అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో లిఫ్ట్ వద్దకు చేరుకున్న శ్రీనివాస్ ముందుగా లిఫ్ట్‌లోకి ప్రవేశించగా, అనసూయ లిఫ్ట్‌లోకి ఎకుతున్న సమయంలో ఒక కాలు లోపల, మ రో కాలు బయట ఉండగానే లిఫ్ట్ తలుపులు పూర్తిగా మూసుకోకముందే అకస్మాత్తుగా పైకి కదిలింది. దీంతో ఆమె లిఫ్ట్, ప్రవేశ ద్వారం మధ్య ఇరుకుపోయి గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. శ్రీనివాస్ కేకలు వేయడం తో అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు అకడికి చేరుకుని లిఫ్ట్‌ను నిలిపేసి, అనసూయను బయటకు తీసి చందానగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అనసూయ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో లిఫ్ట్ మరమ్మతు పనులు జరుగుతున్నప్పటికీ, లిఫ్ట్ టెక్నీషియన్ అనిల్ కుమార్ ప్రధాన విద్యుత్ సరఫరాను నిలిపివేయకుండా, నివాసితులను అప్రమత్తం చేసేలా ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా పనులు నిర్వహించాడని అనసూయ భర్త ఆరోపించారు. అలాగే లిఫ్ట్ టెక్నీషియన్ అనిల్ కుమార్ నిర్లక్ష్యంతో పాటు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు రామ్‌రెడ్డి, యోగేందర్, వెంకట్‌రెడ్డి, లిఫ్ట్ నిర్వహణ సంస్థ జాన్సన్ ఎలివేటర్స్ యాజమాన్యం నివాసితుల భద్రతను నిర్ధారించడంలో విఫలమవడంతోనే ఈ ప్రమాదం జరిగి తన భార్య మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీనివాస్ ఫిర్యాదును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# రెండేళ్ల తర్వాత తొలిసారి మీడియా ముందుకు షేక్ హసీనా!

**నేడు తొలిసారి మీడియా ముందుకు రానున్న షేక్ హసీనా**

**భారత్‌లో ఆశ్రయం పొంది నేటికి సరిగ్గా రెండేళ్లు**

**ఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో ప్రసంగం**

**ఈ సమావేశంతో తమకు సంబంధం లేదన్న భారత ప్రభుత్వం**

**బంగ్లాదేశ్ ఆరా తీయడంతో స్పష్టతనిచ్చిన విదేశాంగ శాఖ**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సుదీర్ఘ విరామం తర్వాత తొలిసారిగా మీడియా ముందుకు రానున్నారు. స్వదేశంలో అధికారం కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమె, బుధవారం ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో విలేకరులతో మాట్లాడనున్నారు. భారత్‌కు వచ్చిన తర్వాత ఆమె బహిరంగంగా ప్రసంగించడం ఇదే మొదటిసారి. 2024లో బంగ్లాదేశ్‌లో చెలరేగిన భారీ విద్యార్థి ఉద్యమం కారణంగా ఆమె తన పదవిని కోల్పోయి దేశం విడిచి వచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి భారత్‌లోనే ఉంటున్న హసీనా, దేశాన్ని వీడి సరిగ్గా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఈ మీడియా సమావేశంతో తమకు ఎలాంటి సంబంధం లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది పూర్తిగా ఒక ప్రైవేటు మీడియా సంస్థ ఏర్పాటు చేస్తున్న కార్యక్రమమని, ఇందులో ప్రభుత్వ ప్రమేయం లేదని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. "ఈ సమావేశాన్ని ఒక ప్రైవేటు మీడియా సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఇందులో భారత ప్రభుత్వ ప్రమేయం లేదు" అని ఆయన పేర్కొన్నారు. షేక్ హసీనా విలేకరుల సమావేశంపై స్పష్టత ఇవ్వాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే భారత్‌ను కోరింది. ఈ నేపథ్యంలోనే భారత విదేశాంగ శాఖ ఈ ప్రకటన విడుదల చేసినట్లు తెలుస్తోంది.

# యూపీఐ చెల్లింపుల వ్యవస్థలో భారీ మార్పు.. ఎవరిపై ప్రభావం?

**యూపీఐ లావాదేవీలపై ఛార్జీల విధింపునకు కేంద్రం కసరత్తు**

**రూ.2,000కు మించిన చెల్లింపులపై రుసుము ప్రతిపాదన**

**ఛార్జీల భారం వ్యాపారులపైనే, వినియోగదారులపై కాదు**

**డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతమే లక్ష్యమంటున్న ప్రభుత్వం**

దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి నాంది పలికిన యూపీఐ సేవలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రూ. 2,000కు మించిన విలువైన యూపీఐ లావాదేవీలపై సర్వీస్ ఛార్జీలు (ఎండీఆర్) విధించేందుకు వీలు కల్పిస్తూ పార్లమెంటులో ఓ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007'కు ఈ సవరణను ప్రతిపాదించారు. అయితే, ఈ ప్రతిపాదనతో సామాన్య వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. వ్యక్తుల మధ్య జరిగే నగదు బదిలీలు (పీ2పీ), చిన్న వ్యాపారులకు చేసే రోజువారీ చెల్లింపులపై ఎలాంటి రుసుములు ఉండబోవని నిపుణులు చెబుతున్నారు. ఈ కొత్త ఛార్జీలను వ్యాపారులే భరించాల్సి ఉంటుంది తప్ప, వినియోగదారులపై నేరుగా భారం మోపే అవకాశం లేదు. ఏడాదికి రూ. 1.5 కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన బడా వ్యాపార సంస్థలకు అందే రూ. 2,000కు మించిన చెల్లింపులపై మాత్రమే 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తిస్తుంది. 2020 జనవరిలో యూపీఐ లావాదేవీలపై కేంద్రం 'జీరో ఎండీఆర్' విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీనివల్ల బ్యాంకులు, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి పేమెంట్ సంస్థలకు ఆదాయం పూర్తిగా నిలిచిపోయింది. నెట్‌వర్క్ నిర్వహణ, సాంకేతిక అభివృద్ధి, సైబర్ భద్రతకు అవసరమైన పెట్టుబడులు పెట్టడం వాటికి భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో రూ. 2,000కు పైబడిన యూపీఐ లావాదేవీల వాటా సంఖ్యాపరంగా 4-5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, విలువ పరంగా మాత్రం 65 శాతం వరకు ఉంది. అందువల్ల, పెద్ద వ్యాపారులపై ఈ నామమాత్రపు రుసుము విధిస్తే ఏటా రూ. 5,000 కోట్ల ఆదాయం సమకూరి, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుతానికి ఇది పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు మాత్రమేనని, దీని అమలు తేదీ, తుది ఛార్జీల శాతంపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందని అధికారులు తెలిపారు.




# ఉదయనిధికి 'స్టాలిన్‌గ్రాడ్'గా మారిన నోటి దురుసు?

- నటి త్రిషపై ద్వంద్వార్థ వ్యాఖ్యల కేసులో ఉదయనిధి అరెస్ట్.. విడుదల
- సనాతన ధర్మం, శశికళపై గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఆయన నోటి దురుసే ఆయన రాజకీయ భవిష్యత్తుకు పెద్ద అడ్డంకిగా మారిందన్న విశ్లేషకులు
- రెండో ప్రపంచ యుద్ధంలోని 'స్టాలిన్‌గ్రాడ్' ఓటమితో పోలుస్తున్న రాజకీయ పరిశీలకులు
- డీఎంకే సిద్ధాంతాలకు, ఉదయనిధి తీరుకు మధ్య పెరుగుతున్న అగాథం

తమిళనాడు రాజకీయాల్లో డీఎంకే యువనేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్ తీరు మరోసారి వివాదాస్పదంగా మారింది. నటి త్రిషను ఉద్దేశించి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల కేసులో ఆయనను పోలీసులు అరెస్ట్ చేయడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అయితే ఇది కేవలం ఒక అరెస్టుకు సంబంధించిన విషయం కాదు. ఉదయనిధి ప్రదర్శిస్తున్న నోటి దురుసు, ఆయన చేస్తున్న వరుస వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన రాజకీయ భవిష్యత్తుకే ఓ 'స్టాలిన్‌గ్రాడ్' (చారిత్రక పరాజయం)గా మారబోతున్నాయా అనే చర్చ బలంగా ఊపందుకుంది.

**తాజా వివాదం ఇదే..**

కావేరి జలాల సమస్యపై తంజావూరులో డీఎంకే నిర్వహించిన నిరసన సభలో ఉదయనిధి ప్రసంగించారు. సీఎం విజయ్‌ను "డమ్మీ సీఎం" అని విమర్శిస్తున్న సమయంలో సభలోని కొందరు "త్రిష.. త్రిష" అని అరిచారు. దానికి ఆయన నవ్వుతూ "కావేరి నీళ్లు వచ్చినా రాకపోయినా.. ఆ నీళ్లు రావాలి" అంటూ ద్వంద్వార్థం వచ్చేలా వ్యాఖ్యానించారు. ఆ తర్వాత "నేను కావేరి నీళ్ల గురించే మాట్లాడుతున్నాను" అని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ వీడియో వైరల్ కావడంతో, అధికార టీవీకే పార్టీ ఫిర్యాదు మేరకు మహిళలను అగౌరవపరిచారనే ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేసి, ఉదయనిధిని అదుపులోకి తీసుకున్నారు.

**వివాదాల పరంపర.. ఇదే మొదటిసారి కాదు**

సామాజిక న్యాయం, మహిళా సాధికారతను తమ సిద్ధాంతాలుగా చెప్పుకునే డీఎంకే పార్టీకి ఉదయనిధి తీరు ఇబ్బందికరంగా మారింది. ఇది ఆయనకు మొదటి వివాదం కాదు. సనాతన ధర్మంపై వ్యాఖ్యలు: "సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా, కరోనా లాగా నిర్మూలించాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. ఇది డీఎంకేతో పాటు దాని మిత్రపక్షాలపైనా తీవ్ర ప్రభావం చూపింది. శశికళపై వ్యాఖ్యలు: 2021 ఎన్నికల ప్రచారంలో, నాటి సీఎం పళనిస్వామి.. శశికళ కాళ్ల వద్ద "శవంలా పాకారు" అంటూ ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని పెద్ద దుమారం రేగింది.

**'స్టాలిన్‌గ్రాడ్' ఓటమేనా?**

రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ సేనలకు 'స్టాలిన్‌గ్రాడ్' వద్ద ఎదురైన ఘోర పరాజయం, నాజీల పతనానికి ఎలా నాంది పలికిందో.. ఇప్పుడు ఉదయనిధి విషయంలోనూ ఈ వరుస వివాదాలు, అరెస్టులు డీఎంకే



భవిష్యత్తుకు అలాంటి పరిస్థితినే తెచ్చిపెడతాయా అనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థులను వ్యక్తిగతంగా, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరంగా మాట్లాడటం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ రాష్ట్రంలో బలపడుతుండటం, మరోవైపు మహిళా ఓటర్లు, యువత ఇలాంటి వ్యాఖ్యల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉండటం ఉదయనిధి రాజకీయ ఎదుగుదలకు పెద్ద సవాలుగా మారింది. సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టుల్లో ఇప్పటికే కేసులు ఎదుర్కొంటున్న ఆయన, తన నోటి దురుసుతోనే తన రాజకీయ గ్రాఫ్‌ను, ప్రజాదరణను తీవ్రంగా దెబ్బతీసుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సముద్రంలో భారత నౌకపై దాడి..



యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న భారత వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో నౌక పూర్తిగా మునిగిపోయిందని, అయితే అందులోని 13 మంది భారతీయ సిబ్బంది సహా మొత్తం 14 మంది సురక్షితంగా బయటపడ్డారని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. 'ఎంఎస్‌వి ఫైజే నూరే ఓలియా' అనే భారత జెండాతో ఉన్న నౌకపై ఆగస్టు 4న ప్రొజెక్టైల్ (క్షిపణి లాంటిది)తో దాడి జరిగింది. దీంతో నౌక బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. వెంటనే స్పందించిన యెమెన్ కోస్ట్ గార్డ్, సిబ్బంది అందరినీ రక్షించి సమీపంలోని మోఖా పోర్టుకు తరలించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "నిరాయుధులైన సిబ్బంది ఉన్న నౌకపై జరిగిన ఈ అకారణ దాడిని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. మన ప్రజల భద్రతే మాకు అత్యంత ముఖ్యం. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని తెలియజేయడం ఊరటనిస్తోంది" అని మంత్రి సోనోవాల్ పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం, భద్రత కోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. భారత విదేశాంగ శాఖ కూడా ఈ దాడిని ఖండించింది. సిబ్బంది భద్రత కోసం రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం యెమెన్ అధికారులతో సమన్వయం చేసుకుంటోందని తెలిపింది. సిబ్బందిని తక్షణమే రక్షించినందుకు యెమెన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది. అయితే, దాడికి ఎవరు పాల్పడ్డారనే విషయాన్ని ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రపంచంలోని అత్యంత రద్దీగా ఉండే వాణిజ్య మార్గాలలో ఒకటైన ఎర్ర సముద్రంలో, ముఖ్యంగా యెమెన్ సమీపంలో ఇటీవలి కాలంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరిగాయి. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా నౌకాయానం ప్రమాదకరంగా మారింది.

# ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్.. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన



చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు మద్దతు తెలిపారు.



## 1.48 లక్షల దిగువకు పుత్తడి

**రూ.900 తగ్గిన తులం ధర**

న్యూఢిల్లీ, ఆగస్టు 3: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. రూపాయి బలోపేతం కావడం, అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు భారీగా తగ్గాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.900 తగ్గి రూ.1.48 లక్షల దిగువకు రూ.1,47,400కి పడిపోయింది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అంతకుముందు ఇది రూ.1,48, 300గా ఉన్నది. పసిడితోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.1,800 దిగి రూ.2,26, 500గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్, వెండిలకు డిమాండ్ పడిపోవడంతోపాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం కావడం ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఈక్విటీల వైపు మళ్లించడంతో వీటి ధరలు తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4,048.89 డాలర్లు పలుకగా, వెండి 57.97 డాలర్ల వద్ద ఉన్నది.

## తయారీ రంగం కుదేలు




న్యూఢిల్లీ, ఆగస్టు 3: దేశీయ తయారీ రంగ కార్యకలాపాల్లో వృద్ధి ఈ ఏడాది జూలై నెలలో ఐదేండ్ల కనిష్ఠానికి పడిపోయింది. సవాళ్లతో కూడిన మార్కెట్ పరిస్థితుల నడుమ మందగించిన కొత్త వ్యాపార ఆర్డర్లే ఇందుకు కారణమని తేలింది. ఈ క్రమంలోనే సోమవారం విడుదలైన సర్వేలో హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 53.5కు తగ్గింది. అంతకుముందు నెల జూన్‌లో ఇది 54.2గా ఉన్నది. దీంతో 2021 ఆగస్టు నుంచి గమనిస్తే.. ఇదే కనిష్ఠంగా తేలింది. కాగా, కొత్త ఆర్డర్లతోపాటు ఉత్పత్తి, ఉపాధి, సప్లయర్ డెలివరీ వేళలు, స్టాక్స్ కొనుగోలు అంశాల ఆధారంగా పీఎంఐ గణాంకాల గణన ఉంటుంది. జూలైలో కొత్త ఆర్డర్లలో వృద్ధిరేటు గడిచిన నాలుగేండ్లకుపైగా కాలంలో రెండో అత్యంత కనిష్ఠ స్థాయికి క్షీణించినట్టు చెప్తున్నారు. అలాగే ఉపాధి సృష్టి సైతం దేశీయ ఉత్పాదక రంగ పరిశ్రమలో వరుసగా మూడో నెల దిగజారిందని సర్వేలో ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. మే, జూన్, జూలై నెలల్లో కొత్త ఉద్యోగాలు అంతగా ఆశాజనకంగా లేవని వివరిస్తున్నారు.

## ఐఐఆర్‌ఎం రూ.150 కోట్ల ఫండింగ్!

బీమా పంపిణీ సంస్థ ఐఐఆర్‌ఎం హోల్డింగ్స్ ఇండియా రూ. 150 కోట్ల నిధులను సమకూర్చుకుంటున్నట్లు తెలిపింది. కార్పెడియం క్యాపిటల్, సాన్ని ఫండ్-1 లీడ్ ఇన్వెస్టర్లుగా వ్యవహరిస్తున్నట్లుగా పేర్కొంది. ఒక్కో షేరుకు రూ. 143.28 ధర చొప్పున ఫుల్లీ కన్వర్టబుల్ వారంట్లు, షేర్ల జారీ ద్వారా నిధులను సమీకరిస్తున్నట్లు కంపెనీ చైర్మన్ వి. రామకృష్ణ చెప్పారు. ఈ మొత్తాన్ని వ్యాపార విస్తరణ, కొనుగోళ్లు, వర్కింగ్ క్యాపిటల్ మొదలైన అవసరాల కోసం వినియోగించుకోనున్నట్లు వివరించారు. సింగపూర్, శ్రీలంక తదితర దేశాల్లో కూడా కార్యకలాపాలు సాగిస్తున్న ఐఐఆర్‌ఎం హోల్డింగ్స్‌కి 18 కార్యాలయాలు ఉన్నాయి. 2,000 పైచిలుకు కార్పొరేట్ క్లయింట్లు, 500 మంది సిబ్బంది ఉన్నారు.



# అమ్మకానికి ఎల్‌ఐసీ వాటా




న్యూఢిల్లీ, ఆగస్టు 3: ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీలో కేంద్ర ప్రభుత్వం 6.5 శాతం వరకు (82.22 కోట్ల షేర్లు) వాటాను అమ్మేస్తున్నది. మంగళ, బుధవారాల్లో ఈ మేరకు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) జరుగుతుంది. ఒక్కో షేర్ ధర రూ.382గా ఉన్నది. మంగళవారం నాన్-రిటైల్ ఇన్వెస్టర్లకు, బుధవారం రిటైల్ ఇన్వెస్టర్లకు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంటుంది. పూర్తి స్థాయి లో షేర్లు అమ్ముడైపోతే ఖజానాకు దాదాపు రూ.31,000 కోట్లు అందుతుందని అంచనా. 'ఈ ఓఎఫ్‌ఎస్ ద్వారా 2.5 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నది. అలాగే గ్రీన్ షూ ఆప్షన్ కింద అదనంగా మరో 4 శాతం అమ్మకానికి పెడుతున్నారు' అని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపమ్) కార్యదర్శి అరుణిష్ చావ్లా సోమవారం ఎక్స్‌లో తెలిపారు. బీఎస్‌ఈలో ఎల్‌ఐసీ షేర్ విలువ రూ.424.35 వద్ద ముగిసింది. దీనిపై 10 శాతం రాయితీ ధరకే ఓఎఫ్‌ఎస్‌లో ఎల్‌ఐసీ షేర్లను అమ్మకానికి పెడుతున్నట్టు చావ్లా వివరించారు. ఇదిలావుంటే క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది మే 16కల్లా ఎల్‌ఐసీలో పబ్లిక్ షేర్‌హోల్డింగ్ 10 శాతానికి చేరుకోవాల్సి ఉన్నది. ప్రస్తుతం కంపెనీలో కేంద్రం వాటా 96.5 శాతంగా ఉన్నది. 2022 మే నెలలో స్టాక్ మార్కెట్లలోకి పబ్లిక్ ఇష్యూ ద్వారా వచ్చినప్పుడు 3.5 శాతం వాటాను అమ్మేసిన విషయం తెలిసిందే. రూ.902-949 ధరల శ్రేణిలో వచ్చిన ఈ ఐపీవో ద్వారా రూ.21,000 కోట్లను కేంద్రం సమీకరించింది. ఎల్‌ఐసీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ.5.36 లక్షల కోట్లుగా ఉన్నది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వం రూ.21,082 కోట్ల నిధులను సమీకరించింది. సూతీ (స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ ది యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా) నుంచి 7 ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా, రెమిటెన్స్‌ల నుంచి ఈ నిధులను పొందింది.

## పెట్రోల్ ఎగుమతులపై ట్యాక్స్ పెంపు!




న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌ల ఎగుమతులపై కేంద్రం విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్‌ను పెంచింది. ఆగస్టు 3 (సోమవారం) నుంచి పక్షం రోజుల పాటు ఇది అమలవుతుంది. ఆర్థిక శాఖ నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీ (ఎస్‌ఏఈడీ)ని లీటరుకు రూ. 15.5 నుంచి రూ. 25.5కి పెంచారు. అలాగే ఏటీఎఫ్‌పై లీటరుకు రూ. 14.5 నుంచి రూ. 22కి, పెట్రోల్‌పై రూ. 2,5 నుంచి రూ. 3.5కి ఎస్‌ఏఈడీ పెరిగింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. దేశీయంగా ఇంధనాల లభ్యతను పెంచేందుకు మార్చి 27న డీజిల్, ఏటీఎఫ్‌పై ఆ తర్వాత మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపైనా విండ్‌ఫాల్ ట్యాక్స్ విధిస్తున్నారు. అంతర్జాతీయ, దేశీయ రేట్ల మధ్య వ్యత్యాసాన్ని ఎగుమతిదారులు అనుచితంగా సొమ్ము చేసుకోకుండా నివారించేందుకు కేంద్రం ఈ ట్యాక్స్‌ను విధిస్తుంది.




## లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!

మంగళవారం ఉదయం మిశ్రమ ఫలితాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 210.08 పాయింట్లు లేదా 0.27 నష్టంతో 78,428.95 వద్ద, నిఫ్టీ 159.40 పాయింట్లు లేదా 0.64 శాతం నష్టంతో 24,614.90 వద్ద నిలిచాయి. ఏథర్ ఎనర్జీ లిమిటెడ్, కేఈఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, గ్రాఫైట్ ఇండియా లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, యూపీఎల్ లిమిటెడ్, సీఈ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ వంటి సంస్థలు నష్టాలను చవిచూశాయి.

# ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆకర్షణీయం!

న్యూఢిల్లీ, ఆగస్టు 3: కరోనా మహమ్మారి నేపథ్యంలో తగ్గిన బ్యాంక్ రుణాల వడ్డీరేట్లకు అనుగుణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పైనా వడ్డీరేట్లు పడిపోయాయి. అప్పట్నుంచి సంప్రదాయ మదుపర్లు సేఫ్ జోన్‌లో అధిక వడ్డీ ఆదాయం కోసం అన్వేషిస్తూనే ఉన్నారు. అయితే ప్రస్తుతం అధిక ద్రవ్యోల్బణం కారణంగా వడ్డీరేట్లు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు గత నెల జూలైకిగాను ఇంకా విడుదల కాలేదు. కానీ అంతకుముందు నెల జూన్‌లో 4.38 శాతంగా నమోదయ్యాయి. ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్బీఐ పెట్టుకున్న 4 శాతం పరిమితిని ఇది మించిపోయింది. ఈ వారం ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష జరుగనున్నది. అయితే ఇందులో కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటాయి. కానీ పశ్చిమాసియా సంక్షోభం, ఎల్ నినోతో వర్షాభావ పరిస్థితుల కారణంగా ద్రవ్యోల్బణం విజృంభించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్ల పెంపు తప్పదన్న అభిప్రాయాలున్నాయి. ఫలితంగా బ్యాంకులూ వడ్డీరేట్లను పెంచేందుకే వీలున్నది. దీంతో ఎఫ్‌డీలపైనా వడ్డీరేట్లు పెరుగడం ఖాయమే అని చెప్పవచ్చు. తొలుత స్వల్పకాలిక డిపాజిట్లు, ఆ తర్వాత లాంగ్ టర్మ్ ఎఫ్‌డీ రేట్లు పెరుగుతాయని బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి.




**అంతకంతకూ విజృంభణ**

వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు అంతకంతకూ పెరుగుతూపోతున్నాయి. నిరుడు అక్టోబర్‌లో 0.25 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జూన్‌లో 4.38 శాతానికి పెరిగాయి. దీనికితోడు టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్టోబర్ ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్ల పెంపు తప్పదన్న అంచనాలు గట్టిగానే నెలకొన్నాయి. కాగా, రుణాల డిమాండ్, డిపాజిట్ల వృద్ధిలో మందగమనం, పదేండ్ల ప్రభుత్వ బాండ్లపై రాబడులు, చిన్న మొత్తాల ఆకర్షణీయ వడ్డీరేట్లు కూడా ఎఫ్‌డీలపై వడ్డీరేట్ల పెంపునకు దోహదం చేస్తాయని అంటున్నారు.

**ఇదీ సంగతి..**

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న ఒడిదుడుకులు.. మదుపర్లను బెంబేలెత్తిస్తున్నాయి. స్టాక్ మార్కెట్లు, డెట్ మార్కెట్లు, బంగారం-వెండి, కరెన్సీ, కమోడిటీ మార్కెట్ సూచీలు తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి మరి. ఈ పరిస్థితులు సురక్షిత పెట్టుబడి సాధనాల కోసం ఇన్వెస్టర్లు అన్వేషించేలా చేస్తున్నాయి. ఈ క్రమంలో ముందుగా కనిపిస్తున్నవి ఫిక్స్‌డ్ డిపాజిట్లే. కానీ దేశ జీడీపీ వృద్ధిరేటు గురించి ఆలోచిస్తున్న ఆర్బీఐ.. ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నా ఓపికతోనే ఉంటున్నది. అయితే ప్రతికూల పరిస్థితులు వడ్డీరేట్ల పెంపునకే ఆర్బీఐని ఉసిగొల్పుతున్నాయని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో బ్యాంకులు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లను పెంచేందుకు వీలుందంటున్నారు.

# గచ్చిబౌలిలో చార్మినార్ సెటప్.. ప్రభాస్ ఫౌజీ షూటింగ్‌కు సాలిడ్ ప్లాన్!





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి--లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటీవల సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ సోషల్ మీడియాలో పలు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, వాటికి నిర్మాతలు ఇప్పటికే చెక్ పెట్టారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

## 'రామాయణ'లో సీతాదేవి, కైకేయి లుక్స్‌పై విమర్శలు..




నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ట్రైలర్ ఇటీవల విడుదలై నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈ ట్రైలర్‌లో నటీనటుల గెటప్‌లు, ముఖ్యంగా సీతాదేవిగా నటిస్తున్న సాయిపల్లవి, కైకేయి పాత్రలో కనిపిస్తున్న లారా దత్తా కాస్ట్యూమ్స్‌పై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సీతాదేవి బ్లౌజ్ డిజైన్, కైకేయి ధరించిన దుస్తుల రంగులపై పలువురు నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తూ విమర్శలు చేశారు. ఈ స్పందనలపై చిత్ర కాస్ట్యూమ్ డిజైనర్లు రింపుల్, హర్‌ప్రీత్ నరులా వివరణ ఇచ్చారు. రామాయణం లాంటి పౌరాణిక కావ్య ఆధారిత చిత్రాన్ని తెరకెక్కిస్తున్నప్పుడు పోలికలు, విమర్శలు రావడం సహజమని, వీటన్నింటికీ తాము ముందే మానసికంగా సిద్ధమయ్యామని వారు పేర్కొన్నారు. సాయిపల్లవి ధరించిన సీతాదేవి కాస్ట్యూమ్‌పై వచ్చిన వ్యాఖ్యలకు డిజైనర్ రింపుల్ స్పందిస్తూ.. "నేను కళ్ళు మూసుకుని సీతాదేవిని తలచుకున్నప్పుడు ఆర్కియోలాజికల్ ప్రామాణికత గురించి ఆలోచించలేదు. మా ఇంట్లోని పూజా గదిలో ఉన్న అమ్మవారి రూపం నా మనసులో ఎలాంటి చిత్రాన్ని ఆవిష్కరించిందో, దాన్నే డిజైన్ చేశాను. అది మేము ఆలోచించి తీసుకున్న స్పష్టమైన నిర్ణయం" అని చెప్పారు. చారిత్రక పరిశోధన డిజైనింగ్‌కు ప్రాథమిక పునాది అయినప్పటికీ, దాన్ని కళాత్మకంగా ఎలా ఆవిష్కరించామనేదే ముఖ్యమని పేర్కొన్నారు. పూర్వకాలం నాటి దుస్తుల ఆధారాలు స్పష్టంగా లభించవు కాబట్టి.. చిన్ననాటి నుంచి చూసిన క్యాలెండర్ ఆర్ట్, రాజా రవివర్మ వర్ణచిత్రాలు, ఆలయ శిల్పాలను దృష్టిలో ఉంచుకుని ఈ రూపకల్పన చేశామని వివరించారు. కైకేయి పాత్రలో లారా దత్తా కాస్ట్యూమ్‌పై వచ్చిన వ్యాఖ్యలపై మరో డిజైనర్ హర్‌ప్రీత్ స్పందించారు. "కైకేయి కాస్ట్యూమ్‌లోని ఆకుపచ్చ రంగు మాతృత్వానికి ప్రతీక కాగా, ముదురు మెరూన్ రంగు ఆమె తీసుకోవాల్సిన కఠిన నిర్ణయాన్ని, దాని వెనుకున్న మానసిక సంఘర్షణను సూచిస్తుంది. సొంత కుమారుడు, రాముడి మధ్య నలిగిపోయే పాత్ర ఆమెది. ప్రతి డిజైన్ వెనుక ఒక ఆలోచన ఉంది. సినిమా చూడక ముందే ఒక ముగింపునకు రావద్దు, థియేటర్‌లో చూశాక మీ అభిప్రాయాన్ని చెప్పండి" అని ఆయన కోరారు.


## మెగా 158.. ఆ రూమర్స్ లో నిజం లేదా!?




ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి హీరోగా చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ లలో తన బ్లాక్ బస్టర్ దర్శకుడు వాల్తేరు వీరయ్య కాంబినేషన్ కొల్లి బాబీ కలయికలో చేస్తున్న సినిమా కూడా ఒకటి. చిరు కెరీర్ 158వ సినిమాగా దీన్ని కన్ఫర్మ్ చేసి గ్రాండ్ స్కేల్లో తెరకెక్కిస్తున్నారు. అయితే ప్రస్తుతం షూట్ శరవేగంగా పూర్తి చేసుకుంటున్న ఈ సినిమాపై ఓ ఇంట్రెస్టింగ్ రూమర్ స్పెక్యులేట్ అవుతుంది. దీని ప్రకారం మెగాస్టార్ ఇందులో డ్యూయల్ రోల్ అది కూడా తండ్రీ కొడుకులు పాత్రలు చేస్తున్నారు అంటూ రూమర్స్ మొదలయ్యాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ట్రెండ్ లో కూడా మెగాస్టార్ ఈ తరహా రోల్స్ చేయడం లేదనే టాక్. సో ఇందులో నిజం లేదనే అనుకోవాలి. ఇక ఈ చిత్రంలో అనస్వర రంజన్ చిరు కూతురు పాత్రలో నటిస్తుంది. అలాగే థమన్ సంగీతం అందిస్తున్నాడు. కే వి ఎన్ సంస్థ నిర్మాణం వహిస్తున్నారు.

## 'టాక్సిక్' ట్రైలర్ తో అయినా హైప్ లేస్తుందా?

కన్నడ రాకింగ్ స్టార్ యష్ ఇప్పుడు రెండు భారీ ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. వాటిలో ఒకటి టాక్సిక్ చిత్రం గ్రాండ్ గా ముందు విడుదల కానుండగా తర్వాత రామాయణ రాబోతుంది. అయితే వీటిలో ఈ ఆగష్టు లోనే దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కించిన యాక్షన్ చిత్రం టాక్సిక్ పై హైప్ మాత్రం అప్పట్లో ఉన్నంత లేదు. ఎన్నో ఏళ్ళు కితం మొదలు పెట్టిన ఈ సినిమా పలు వాయిదాలు అనంతరం వస్తుంది. ఈ గ్యాప్ లో ఉన్న హైప్ కూడా తగ్గింది. ఇక అంతా ఇపుడు రానున్న ట్రైలర్ కోసమే ఎదురు చూస్తున్నాయి. అదొక్కటే సినిమాకి సేవియర్ గా మారనుంది. ఈ ఆగష్టు 8న బెంగళూరులోకి గ్రాండ్ గా ట్రైలర్ విడుదల కానుండగా ఇది వచ్చాక ఏమన్నా హైప్ మారుతుందో లేదో చూడాలి. ఈ సినిమాలో కియారా అద్వానీ, నయనతార, రుక్మిణి వసంత్ లు హీరోయిన్స్ గా నటించగా కే వి ఎన్ ప్రొడక్షన్స్ నిర్మాణం వహిస్తున్నారు.




## డీప్‌ఫేక్ బారిన మృణాల్ ఠాకూర్ ..

బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినీ పరిశ్రమలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మరోసారి వార్తల్లో నిలిచారు. డీప్‌ఫేక్ (ణవవజూఞ్ఱనవ) ఫొటోల కారణంగా హాట్ టాపిక్‌గా మారింది. తనకు సంబంధించిన మార్ఫింగ్ చేసిన చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై మృణాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరిస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఓ ఎంటర్‌టైన్‌మెంట్ పేజ్ మృణాల్ ఠాకూర్ మార్ఫింగ్ చేసిన ఫొటోలను అభ్యంతరకర రీతిలో షేర్ చేసింది.ఏఐ సాయంతో రూపొందించిన ఈ డీప్‌ఫేక్ చిత్రాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో మృణాల్ స్పందించక తప్పలేదు. ఈ ఫొటోలు పూర్తిగా నకిలీవని, తన అనుమతి లేకుండా రూపొందించి ప్రచారం చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన మృణాల్ ఠాకూర్.. నా పేరుతో ప్రచారం చేస్తున్న ఈ మార్ఫింగ్ ఫొటోలు పూర్తిగా అనధికారికమైనవి, చట్టవిరుద్ధమైనవి. వెంటనే వాటిని తొలగించాలి. ఇకపై ఎవరైనా ఈ చిత్రాలను షేర్ చేసినా లేదా ప్రచారం చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అధికారికంగా ఫిర్యాదు చేస్తాను అంటూ హెచ్చరించారు. సెలబ్రిటీల వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసేలా ఇలాంటి డీప్‌ఫేక్ కంటెంట్‌ను సృష్టించడం, ప్రచారం చేయడం తీవ్ర నేరమని ఆమె పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ పలువురు సినీ నటీమణుల ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇంతకుముందు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నతో పాటు పలువురు ప్రముఖ నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ వీడియోల బారిన పడ్డారు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, డీప్‌ఫేక్‌లపై కఠిన చట్టాలు అవసరమన్న డిమాండ్ కూడా వినిపించింది. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా బహిరంగంగా స్పందించడంతో సోషల్ మీడియాలో జరుగుతున్న డిజిటల్ దుర్వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. మృణాల్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ఆమెకు సంబంధించినట్లు ప్రచారం చేస్తున్న కొన్ని వివాదాస్పద పోస్టులు ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తుండటం గమనార్హం. ఈ ఘటనపై సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫాంస్ లేదా అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.



## నా శరీరాన్ని యంత్రంలా చూశాను:



ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తాను షూటింగ్ లో గాయపడడంపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను నటిస్తున్న 'మైసా' సినిమాలోని ఓ డ్యాన్స్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని తెలిపారు. తన గాయం గురించి, విశ్రాంతి గురించి వివరిస్తూ సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. 'గాయాలు చాలా బాధిస్తాయి. ఈ విషయం ఎవరికీ తెలియకూడదని నేను నిజంగా ఆశించాను. కానీ, ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇన్ని రోజులు కనిపించనందుకు క్షమించండి. నేను మళ్ళీ వచ్చేశాను. ఇది జరిగి కొంతకాలం అయింది. వరుసగా ఇది నాకు మూడో గాయం. నా శరీరాన్ని యంత్రంలా కాకుండా, మనిషి శరీరంలా చూడటం నేను కచ్చితంగా నేర్చుకోవాలి" అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన గాయం తీవ్రతను వివరిస్తూ, "ఈ గాయం గురించి ఎలా చెప్పాలంటే.. మన తుంటికి, కాలికి మధ్య నాలుగు టెండన్లు ఉంటాయి. వాటిలో నా కుడి వైపు ఉన్న ఒక టెండన్ తెగిపోయింది. అది మళ్లీ అతుక్కుంటేనే నేను కాలు పైకి ఎత్తగలను. 'మైసా' సినిమాలోని డ్యాన్స్ షూట్‌లో ఇది జరిగింది. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో ఇదే అత్యంత అగ్రెసివ్ ఫిల్మ్ అని చెప్పొచ్చు. కానీ కంగారు పడకండి. నొప్పి ఉన్నా భరించలేనిది ఏమీ కాదు'' అని ఆమె వివరించారు. ఈ గాయాన్ని దేవుడు తనకు బలవంతంగా ఇచ్చిన సెలవుగా భావిస్తున్నానని రష్మిక పేర్కొన్నారు. "నాకు నేనైతే ఎప్పుడూ బ్రేక్ తీసుకోను కాబట్టి, దేవుడే ఈ రూపంలో నాకు విశ్రాంతి ఇచ్చాడనిపిస్తోంది. నాకు తగిలిన ఈ గాయాలన్నీ యాదృచ్ఛికంగా జరిగినవే. ఇది బలవంతపు సెలవు అయినా, నేనేమీ బాధపడటం లేదు. ఈ సమయంలో చాలా పజిల్స్ పూర్తి చేస్తున్నా, వాటిలో నేను ఇంత బాగా ఆడతానని నాకు తెలియదు" అని ఆమె తెలిపారు. వర్కవుట్లు చేయలేకపోవడంపై తన ఆందోళనను కూడా పంచుకున్నారు. "నేను వర్కవుట్లు, రన్నింగ్ బాగా చేయడం వల్లే ఫిట్‌గా ఉంటాను. ఇప్పుడు కొంతకాలం వాటికి దూరంగా ఉండాలి. వర్కవుట్ చేయలేకపోతే నేను తినడం మొదలుపెడతాను. స్వీట్స్ ఎక్కువగా తింటాను. దానివల్ల బరువు పెరిగే అవకాశం ఉంది.

Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com